# నిరీక్షణ

నేను ఆయింట్లో దిగిన మొదటిరోజు సాయంకాలం ఎవరిని చూశానో అతడినే ప్రతీరోజూ, నెలరోజుల తర్వాతగూడా అదే సమయానికి చూస్తూ ఉన్నాను. వర్షం కుంభవృష్టిగా కురుస్తున్నా అలానే తడుస్తూ నేనుండే యింటిముందు నుండీ కట్టవలో కలిసిపోయిన బాటవెంట వెళ్ళేవాడు. సాంధ్య రేఖలు చిక్కబడి కావిరంగులోకి రాగానే అరిగి, చిరిగి, శిథిలావస్థలోనున్న చెప్పుల్ని శబ్దంచేసుకొంటూ ఆబాటలో కలిసి పోయేవాడు. మళ్ళీ చీకట్లుచుట్టూ ఉన్న తోటల్లోని గున్న మామిడిగుబురుల్లోంచి ఆకాశంలోకి వ్యాపించే సమయంలో అవే చెప్పులశబ్దంతో యింటి ముందునుండి వచ్చేవాడు.

ఊరికి చివర యిల్లువుండడంవల్ల అంతగా జనసంచారం కూడా ఉండేదికాదు. ఎప్పుడో ప్రొద్దున్న ఎండిన చితుకులకని కట్టవ కావల చిట్టడవిలోకి వెళ్ళే పాటకజనం, తిరిగి పుల్లల మోపులతో సాయంకాలం రావడమేతప్ప మరింకేలాంటి సంచారమూ ఆప్రదేశంలోలేదు. అప్పుడప్పుడు గొల్లకుర్రాడు పశువులను తోలుకొంటూ, కూనిరాగాలు తీసుకొంటూ, మందలను అదలిస్తూ పచ్చిక మేపడానికై వెళ్తుండేవాడు. మిగతాసమయంలో ఆప్రదేశమంతా నిర్మానుష్యంగా బిక్కు బిక్కుమంటూ ఉండేది. పగటివేళల్లోగూడా సాధారణంగా ఎవరూ అటుపోయేవారుకాదు.

ఆ ఊరు అప్పటికి నాకు క్రొత్తగానే ఉంది. బోర్డు హైస్కూలుకు డ్రాయింగు మాష్టారుగా ఆవూరుకు భార్యతో

మొదటిసారి వెళ్ళాను. ఆ మరుచటిరోజే తోటి ఉపాధ్యాయులొకడు తక్కువఅద్దెలో ఊరుచివర యిల్లొకటి చూపించారు. అప్పటికది చాలా శిథిలావస్థలో ఉన్నా యింట్లోదిగిన తర్వాత కొంతవరకూ బాగుపడింది.

నేనుండే యింటికి వందగజాల దూరంలో కంకరబాట ఆఖరై కట్టవమొదట్లో కలిసిపోయింది. దానిలో బడి పోతే లక్ష్మీప్రతిగారి ఫుంత. ఫుంతచివర ఏనాటిదో ఓ పెద్దచింత చెట్టు విస్తృతంగా వ్యాపించి గాలికి తరచుగా శబ్దంచేస్తూ ఉంటుంది. దాని వెనుక చిట్టడివి తప్పితే మరింకేమీ లేదు. పుల్లలకెళ్ళినవాళ్ళు మోపులతో ఆచెట్టుక్రింద ఆగి కాస్తంత విశ్రాంతి తీసుకొని చీకటిపడకుండా అక్కడ నుండి కంకర బాటకు చేరుకుంటుంటారు. సాయంకాలం ఎండ వాలకుండానే ఆచెట్టుక్రింద చీకట్లు కురుస్తుంటాయి. అంతా కలిసి కట్టుగాఉండడంమూలాన మోపులు దించుకున్న ఆవాళ్ళు ఆ చెట్టుమీద దెయ్యాలున్నాయనే మాట మర్చిపోయి మోటుగా వేళాకోళాలాడుకొంటూ జ్ఞాపకంరాగానే, చచ్చి పడున్న పాములా మెలికలుతిరిగినకట్టవలో చీకట్లతో పోటీపడి వెలుతురుండగనే ఊరిలోకి పరుగెత్తిపోతుంటారు.

ఆచెట్టుమీద దెయ్యాలున్నాయని, రాత్రిళ్ళు ఏవేవో శబ్దాలు చేస్తుంటాయని ఆవూర్లో విశేషంగా ప్రచారంలో ఉంది. ప్రారంభంలో యీవిషయాలన్నీ తెలీక యింట్లోదిగినా తెలిసినతర్వాతకూడా ఆయింట్లోంచి కదలివెళ్ళాలనిపించలేదు. పట్నంవాడినైన కారణంగా దెయ్యంభయం నాకెప్పుడూ

లేదు. కాగా యిల్లు చిట్ట చివరఉండడంవల్ల దొంగలు పడతారనే భయంతప్ప మరెలాంటి చింతా లేదు. మా ఆవిడ కూడా దెయ్యాలమీద నమ్మకం లేకపోయిన కారణంచేత అప్పుడప్పుడు బావివద్ద పరిచయం అయిన ఆడాళ్ళంతా 'ఆ యింట్లో పూర్వం దెయ్యాలుండేవని అందుకే ఆయింట్లో చాలాకాలంగా ఎవరూ కాపురం ఉండడంలేదని' తరుచుగా అంటున్నా నాతో ఎప్పుడూ 'ఈయిల్లుమారి మరో యింట్లోకి వెళ్దాం' అనైనా అనలేదు.

సాయంకాలం స్కూలునుండి రాగానే స్కెచ్ పుస్తకంతో కిటికీ ముందుకూర్చుని చిట్టడివిచెట్లను, వాటిబడిలో దాక్కుని సమయంచూసి బారులుగా ఆకాశంలోకి ఎగిరిపోయే పక్షుల్ని, వాటి వెనుక గాలిలో తేలి కనుచూపుమేరలో కొండచరియల మీద మేతకై వాలే మేఘాలగుంపుల్ని, కంకరబాట,— మెలికల కట్టవ, మోపుల ఆడాళ్లు ఇంకా చాలాచాలా వాటిని చిత్రాలుగా పుస్తకంలోకి ఎక్కిస్తూ కళాసృష్టిలో మునిగి ఉండేసమయంలో బయట చెప్పులశబ్దం వినిపించి రసాభాస జరుగుతుండేది. ఆవైపు ముఖం ఎత్తిచూస్తే బాట చివర మలుపు తిరిగే మనిషి తప్పితే మరెవరూ కనిపించేవారు కాదు. మరో అరగంటకు అదే శబ్దం చీకట్లముసుగులోంచి నిశ్శబ్దాని భంగపరుస్తూ తిరిగి వినిపిస్తుండేది.

కాలక్రమేణా నా ఆచరణలో మార్పువచ్చినా అతని ఆచరణమాత్రం కొంచెంకూడా మారలేదు. వేసినచిత్రాన్నే వేయడం నాకు విసుగువేసి వట్టినే కిటికీముందు కూర్చునేవా

డిని. అతను మాత్రం ఎప్పటిలా ఆబాట వెంటే వెళ్ళి చీకట్లు తరుముకొస్తుంటే వెనక్కు మరలే వాడు.

అలా అతను ఎక్కడకు వెళ్తున్నాడో తెలుసుకోవాలన్న అభిప్రాయం చాలా మార్లు కలిగింది. కాని ఆవిషయంలో ఎందుచేతనో కొంతకాలంవరకూ శ్రద్ధచూపలేదు. ఓమారు స్కెచ్ పుస్తకంతో బయలుదేరి కట్టవప్రారంభంలో చిత్రా లుగీసుకొంటున్నాను. అతను నాముందునుండే వెళ్ళిపోయాడు. నావైపుగాకూడా చూడలేదు. ఏదో విషయాన్ని మనసు లోనే ఆలోచించుకుంటున్నట్టు భారంగా అడుగులు వేసు కుంటూ, ధూళినిఅరడుగుఎత్తు లేపుకుంటూ వెళ్లిపోయాడు. ఆకట్టవబాటలో అతను కనుపించేంతవరకూ చూస్తూకూర్చు న్నాను. ధూళిదట్టంగా, యింకాదట్టంగా చేరి అతడిని కప్పి వేసి కనుపించకుండా చేసింది. అతను ఎక్కడకు వెళ్తున్నాడో కూడా వెళ్ళిచూద్దామని వేస్తున్న చిత్రం అంతటితోఆసి ఆవె నకాలే వెళ్ళాను. అతను పుంత వెంబడేవెళ్ళి చింతచెట్టు మొద ట్లో కూర్చున్నాడు. ఏకాంతానికి అండగా చుట్ట వెలిగించి దాని పొగలో ఏర్పడిన ఆకారాల్ని చూస్తున్నాడు.

ఆయనకు ఎదురుగుండా వెళ్ళేవరకూ నన్ను చూడలేదు. ఆ తర్వాత కొంచెం చలించి "ఎవరుమీరు ?" అన్నాడు. ఆ మాటల్లో కొంచెం భయం, ఆతృత ఉన్నాయి. నేను ఆయన దగ్గరకంటా వెళ్ళి "నేనూ. డ్రాయింగు మేష్టారుని "అన్నాను. నామాటలు వినిపించలేదు గాబోలు నావైపు కళ్ళార్పకుండా చూశాడు. "నేనూ ... బొమ్మలు వేసుకొనేవాడిని." తిరిగి

అన్నాను నేను. అతను అర్థమయినదన్నట్టుగా దృష్టి నానుండి మరల్చాడు. నేనుమాత్రం అతనివైపే చూస్తూ నుంచున్నాను.

మనిషి బక్కపలుచగా నల్లగా ఉన్నాడు. లోతుకుపోయిన కళ్ళూ కణతలు, ఘూళిగొట్టుకుపోయిన తలా బట్టలు, చొక్కా కుడిప్రక్క చిరిగిపోయిన కన్నంలోంచి కనుపిస్తున్న ఎముకల్ని అంటిపెట్టుకున్న గుండె—అచ్చంగా పిచ్చివాడిలా ఉన్నాడు!

అతను తిరిగి నావైపు చూడడంతోనే "ఇక్కడున్నారేం" అన్నాను. అతను నవ్వి ఊరుకున్నాడు. ఆ నవ్వులో 'యిక్కడుంటే నీకేం?' అన్న భావం స్ఫురించింది. ఆ తర్వాత అతనే అన్నాడు "వట్టినే" అని. చాలా సేపటివరకూ మళ్ళీ అతను మాట్లాడలేదు. అతనివైపే చూస్తూ మధ్యలో రెండుమూడు చిత్రాలు అతనివే వేస్తూ కూర్చున్నాను.

అతను ఆపుస్తకం ఓమారు చూస్తానని తీసుకున్నాడు. అంతా చూశాక "మీరు చూడకుండా బొమ్మలు బాగా వేస్తారా?" అన్నాడు. జవాబుగా ఊఁ అన్నాను పరధ్యాన్నంగానే అదేదో పెద్దవిషయం కాదన్నట్టు. అతను ఆశగా నావైపుచూసి "నాకోబొమ్మ వేస్తారా చెప్తాను" అన్నాడు. తలాడించాను. అతను కాస్సేపు ఏదో ఆలోచించి "చెప్పమంటారా?" అన్నాడు. మళ్ళీ 'చెప్పండి' అన్న ధోరణిలో ముఖం అతనివైపే తిప్పాను.

"ఇరవై ఏళ్ళ పిల్ల. ఎర్రని దొండపండులాంటి రంగు ... ... వింటున్నారా ... తలలో చేమంతిపూల దండ తురుముకొని కడవెత్తుకొని వస్తుంటే గాలికి అల్లల్లాడే ఆ సన్నని తీగ

లాంటి నడుం, తీగకు చివర తెల్లగా విరియబూచిన మాలతి పుష్పంలా నవ్వుముఖంలో కలకిల్లాడే తెల్లటి పళ్ళు, దిక్కుల చివర చీకట్లు గడ్డకట్టిన నల్లంచుల జార్జెట్టులా సొగసుచేసిన కాటుక కన్నులు, గుండెలమీద కొమ్ములు మొలిచినట్టుగా వాడిదేరి ముందుకువచ్చిన వక్షాలు, నడిస్తే ఘల్లు ఘల్లు మని లయతప్పక శబ్దించేసే అందెళ్ళు, సెలఏటిలా గలగలలాడే గాజులు — నిజంగా బంగారుబొమ్మ తెచ్చి నిలబెట్టినట్టుగా ఉండాలి. దెయ్యంగామాత్రం వెయ్యకండి. అచ్చంగా రంభే మీకు తెలుసుగా రంభ ఎలా ఉంటుందో. అయితే వెయ్యండి" అతను అలా అంటూ ఒక్కసారె ఊహాజగత్తు లోకి వెళ్ళిపోయి ఏవో భావనల్లో రూపాల్ని సృష్టించు కొంటూ అచేతనగా ఉండిపోయాడు.

అతను చెప్పినట్టుగా అంత అతిశయోక్తితో ఆ చిత్రాన్ని వేయడం తలకుమించినపని. అటువంటివారిని మెప్పించడం చాలాకష్టం. ఆ చిత్రం అప్పటికప్పుడు అయ్యేదికాదు గనుక, రంగులుకూడా దగ్గిరలేవుగనుక తర్వాత వేసిస్తానని చెప్పి వచ్చేశాను.

ఆమరుచటిరోజు ఆదివారం. ప్రొద్దుటినుండీ ఆ సుందరి చిత్రమే వేస్తూ కూర్చొని సాయంకాలనికి పూర్తిచేసి అందంగా ఉండడానికి చుట్టూ మౌంటుచేసి తీసుకెళ్ళియిచ్చాను. నిజానికి ఆ చిత్రం వేసి యిద్దామని నాకులేదు. కాని ఆ చిత్రానికి అతని జీవితానికి ఏదో సంభంధం ఉండిఉంటుందని, అది తెలుసుకుందామని చిత్రం అతను చెప్పినరీతిలో నాకున్న నేర్పంతా ఉపయోగించి వేసిచ్చాను. చిత్రాన్ని చూశాక పెదవివిరిచాడు.

"లేదండీ. మీరు వెయ్యలేరు. ఆమె యింకా అందంగా ఉంటుంది" నోట్లో గొణుక్కున్నట్టుగా అన్నాడు. నాకు చెళ్ళున లెంపకాయ కొట్టినట్లనిపించింది. ఒకరోజుల్లా మిగిలిన పనులన్నీ మాని అతనిగురించని స్వప్రయోజనం లేకపోయినా ఆ చిత్రంవేసిస్తే అంత తేలిగ్గా తీసిపారెయ్యడం చాలా బాధ కలిగించింది. డ్రాయింగులో డిప్లమో తీసుకున్న నన్నే విమర్శించడం బాధనిపించినా అతను యింగిత జ్ఞానంఉండి అలా అనడంలేదని, ఏదోఒక మూడ్‌లోఉండి అలా అంటున్నాడని గ్రహించాను. అతని జీవితంలోని ఆస్త్రీ పాత్రనుగురించి తెలుసుకుందామనే కుతూహలంతో "ఆ అమ్మాయేగనుక దగ్గరుంటే క్షణంలో ఆమె చిత్రాన్ని వేసిస్తాను" అన్నాను.

ఆ మాటలువిని ఒక్కసారి క్రిందకంటా దిగబడిపోయిన వాడల్లే భారంగా నిట్టూర్చి అన్నాడు. "ఆవిడేఉంటే మీ చిత్రం ఎవరిక్కావాలి. నాలక్ష్మి బ్రతికేఉంటే మీలాంటి వాళ్ళచేత చిత్రాలు గీయించి ఆమె ఆకారాన్ని అందాన్ని పాడుజేస్తాననుకున్నారా? అలాంటి దేవతను మళ్ళీ జీవితంలో చూడగలనా? నాలక్ష్మి...నాఅందాలబరిణె నన్ను ఒక్కడిన్ని చేసి యిలా పిచ్చివాడిగా రోజూతిరగమని ఈ లోకంనుంచి వెళ్ళిపోయింది." ఆ చివరమాటలు అంటుంటే గొంతుబొంగురు పోయింది. మాట యిక పెకిలి బైటకురాలేదు. దుఃఖంతో బావురుమని ఏడ్చాడు. అతన్ని చూస్తే జాలివేసింది. అతని ప్రవర్తననుబట్టి ఎంతో అన్యోన్యంగాఉండే యిల్లాలు పోయినట్టు తోస్తోంది. అతన్ని ఊరుకోబెడదామని ప్రక్కనే

కూర్చొని సముదాయించాను. నా ఎదురుగుండా ఏడవడం సిగ్గనిపించిగాబోలు చటుక్కున ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకొని వెళ్ళిపోయాడు. అతని వెనకాలే నెమ్మదిగా అడుగుల్లో అడుగులు వేసుకొంటూ యింటికి వెళ్ళిపోయాను.

మళ్ళీ చాలాకాలంవరకూ అతడిని కలుసుకోలేను. మాఆవిడకు రెండురోజులబట్టీ జ్వరంవస్తోంది. నెలలు నిండిన ఆమెను ఆపరిస్థితుల్లో పనిచేయించడం యిష్టంలేక నేనే యింటిపనులూ వంటపనులు చూస్తూ వేళకు మళ్ళీ స్కూలుకు పోవడంవల్ల వారం రోజులవరకూ అతడిని కలుసుకోలేకపోయాను. ఒక రోజు కూరలు కొనుక్కొని ఆలస్యం అయిపోయిందని కంగారుగా వచ్చేస్తుంటే అతను ఎదురుగావచ్చి నన్ను చూడకుండానే సందుమలుపు తిరిగాడు.

నేనే అతడిని పిలిచి "ఎక్కడకు వెళ్తున్నారు" అన్నాను. అతను దగ్గరకు వచ్చి ముఖంనుప్తులెత్తి "యింటికి" అన్నాడు. "ఎక్కడ?" తిరిగి ప్రశ్నించాను. "ఇస్తానా చెంది" అంటూ తీసుకుపోయాడు. కూర్లాసంచితోడా అతను ప్రక్కన నడుస్తూ అతనితోపాటే శివాలయం ప్రవేశించాను.

ఆలయంలో ఉత్తరంవైపు మంటపానికి ప్రహారీగోడకు మధ్య మూడడుగుల ఖాళీ చూపించి "యిదే" అన్నాడు. అనుకోకుండా ఆశ్చర్యం, కన్నీళ్ళువచ్చాయి. మంటపంమీదనుండి ప్రహారీగోడకు నాలుగైదు కర్రలు అడ్డంగావేసి పైనుండి ఎండ తగులకుండా కొబ్బరాకులు తాటాకులు చిందరవందరగా వేసి, ఉన్నాయి. ఎండనుండి కొద్దిరక్షణగా ఉన్నాయేమోగాని

వర్షం వస్తే అదంతా ఆలోపలే ఉంటుంది. నేను ఆకులకేసి పరిశీలనగా చూస్తుండంచూసి అతనే అన్నాడు. "ఉత్తప్పుడు యిక్కడే పడుకుంటాను. వర్షం రోజుల్లో మంటపం ఉండనే ఉంది. బాగా పెద్దదివస్తేగాని జల్లు లోపలికందటాదు."

అలాఅంటూ లోపలకువెళ్ళి చుట్టచుట్టిన బట్టలమూట లోంచి రెండరటిపళ్ళు తీసిచ్చాడు. వద్దని వస్తేస్తున్నా బలవంతంగా చేతిలోపెట్టాడు. తప్పనిసరిగా తీసుకోవలసివచ్చి అంది పుచ్చుకొని గుడిదాటి ఆమకొంటున్న కుర్రాళ్ళ కవిచ్చి ఆలోచించుకొంటూ యింటికి వెళ్ళిపోయాను.

అర్థంకాని అతని విచిత్రప్రకృతి, అతనిజీవితంలో వెన్నెల్లు కురుపించి మెరుపులా మాయమయిన ఆస్త్రీపాత్ర ప్రాముఖ్యం తెలుసుకోవాలనే కోరిక బలంగా నాలో నాటుకపోయాయి. ఆవిషయాన్నే ఒకరోజు అతనికూడావెళ్ళి సమయం కనిపెట్టి మెల్లగా అడిగాను. అతను కాస్సేపటివరకూ ఏమీ మాట్లాడకుండా ఏదో ఆలోచించి ఆ తర్వాత "ఇప్పుడొద్దు తర్వాత చెప్తాలెండి" అన్నాడు. అలాఅని నన్నుచూసి "చీకటి పడుతోంది. ఇక మీరువెళ్ళండి" అన్నాడు.

నాకు కొంచెం ఆశ్చర్యంవేసింది. ఆశ్చర్యపోతూనే "పరవాలేదు, నాకు ఎలాంటి భయమూలేదు." అన్నాను. అతను తీక్షణంగా నావైపుచూసి అన్నాడు. "వద్దు. మీరు వెళ్ళిపొండి. తర్వాత నేను వస్తాను." నేను మరింకేమి అనలేకపోయాను. చెప్పినా ఫలితం ఉండదని నాకు తెలుసు. మెల్లగా కాళ్ళీడ్చుకొంటూ విచిత్రమైన అతని ప్రవర్తనను పదేపదే ఆలోచించుకొంటూ ఇంటికి వెళ్ళిపోయాను.

నా ఆలోచనలకు ఎలాంటి అంతూ చిక్కలేదు. పరిభ్ర మించే భావాలకు చిత్తంవచ్చినట్లు పర్యవసానాన్ని ఊహించు కొంటూ ఆరాత్రి అతని ఆలోచనలతోనే నిద్రపోయాను.

ఆమర్నాడు తిరిగి అతడిని కలుసుకుందామనుకున్నాను. గాని వర్షం కుండలతో దిమ్మరించినట్లుగా కురవడంవల్ల రెండు రోజులవరకూ అటు వెళ్ళలేదు. కాని అతడినిమాత్రం ఆ రెండు రోజులూ అలా వర్షంలో తడుస్తూ వెళ్ళడంమాత్రం చూశాను.

మరుచటిరోజు అతను వెళ్ళగానే ఆ వెనుకనే బయలు దేరాను. నన్ను చూసి రండి కూర్చోండి అన్నాడు. కూర్చొంటూ సిగరెట్టొకటి వెలిగించి అతనికీ ఒకటి అందిం చాను. వద్దన్నట్టుగా చేతిని ప్రక్కకునెట్టుతూ చుట్టతీసి వెలి గించుకున్నాడు. సిగరెట్టు కాలుస్తూ ఆచుట్టూఉన్న సీతాఫల చెట్లూ, తుమ్మచెట్లు, పిచ్చిమొక్కలు-వాటిని దట్టంగా ఆవరిం చినతీగలు, వాటిమధ్యనుండి ఎగిరిపోయే పిట్టలూ చూస్తూ సిగ రెట్టు చేతికి చుర్రుమని అంటుకోగానే ప్రక్కకు విసరి అతని కళ్ళల్లోకి చూశాను. చింతనిప్పుల్లాంటి కళ్ళల్లో చుట్టూరా నిండిన సాంధ్యరాగంలోని అరుణవర్ణం కరిగి ఎర్రనిబొట్లుగా కాలిపోతోంది!

"మీకు ఆమెను గురించి చెప్తానన్నానుగదూ?" అన్నాడు అప్రయత్నంగా నా భుజంమీద చెయ్యివేసి. ఔనన్నట్టుగా తలూపాను. అతను భారంగా నిట్టూర్చి ప్రారంభించాడు.

"నేను చెప్పేది ఎప్పటిదనుకుంటున్నారు. ఇరవై ఏళ్ళ మాట! అప్పుడు పాతికేళ్ళవాడిని. కండతిరిగి దండకలిగి

ఉండే రోజులవి. నాలక్ష్మి ఉండేది చూశారూ యిరవయ్యో పడిలో ప్రవేశించి నిగనిగలాడుతూ ఉండేది. జమిందారుగారి దగ్గర గుమాస్తాగా ఉంటున్నరోజుల్లో శిస్తు వసూలు కని తరచుగా ఆవూరు వెళ్తుండేవాడిని. ఒకనాడు ఆమె కడవెత్తుకొని దిగుడుబావి దగ్గర్లో కనుపించి లేడిలా దూసుకుపోయింది. ఆమర్నాడూ, ఆతర్వాతరోజూ-అలాగే ఆ ఊర్లో ఉన్నంతకాలమూ కనుపించి నిద్రాణమైన కోరికల్ని లేవనెత్తింది. వెళ్ళిపోతున్నప్పుడు దీనంగా ముఖంపెట్టి కళ్ళతో ఏదోచెప్పింది. ఆచూపులే మరో నాలుగు రోజులలో పనిలేకపోయినా ఆవూరికి ప్రయాణంకట్టించాయి.

మొదటిసారిగా ఆమె జమిందారుగారి పొలంలో మేటగా పేర్చిన వరికుప్ప వెనకాల సంధ్య వెలుతుర్లో కలిసి మనసిచ్చి మాట్లాడింది. రోజూ అదేచోట కలిసి తెల్లమల్లెల్ని నాచేత తురిమించుకొని వెళ్ళేది. ఒకనాడు ఆమె వచ్చి ఆదోలా ముఖంపెట్టి "తన రాక వాళ్ళెవరికీ యిష్టంలేదని" అంది. దగ్గరకు తీసుకొని ఎంతోకాలం నుండి చెప్పాలని దాచిన విషయం మెల్లగా ఆమె చెవులో చెప్పాను. ఆమె జవాబేమీ చెప్పకుండా మౌనంగా ఉండిపోయింది. ఆమౌనంలో ఎంతటి నిఘూఢభావముందో అర్థంకావడానికి కష్టం అనిపించలేదు. ఆనాడే అర్థరాత్రి నాతో పట్నంచేరుకొంది. పట్నంలో వంగి దేవుడిముందు నమస్కరిస్తున్నప్పుడు "తథాస్తు" అన్న పూజారే మా ఆదర్శ వివాహానికి నిదర్శనం. పుస్తె కట్టకపోయినా తెచ్చిపెట్టుకున్న యిల్లాలులా ఆమెను ఎప్పుడూ చూడలేదు నేను.

ఐదేళ్ళ కాపరంలోనూ బంగారాన్ని పండించింది. ఆమె కంఠానికి నాచేతుల్తో చంద్రహారాన్ని తగిలించాను. ఆమె క్రిందకు జారుతున్న చీరకుచ్చిళ్ళను పైకెత్తి ఒయ్యారంగా నడుస్తుంటే యిద్దరం క్రొత్తగాకట్టిన పెంకుటింటిలో గృహప్రవేశం చేశాం. అదీ ఆమెకళ! సాక్షాత్తు లక్ష్మీదేవి! జమిందారునుండి మాని స్వయంగా వ్యాపారం ప్రారంభించి వేలు ఆర్జించాను.

ఒక్కసారి అంధకారం మధ్య మెఱుపుమెరిస్తే, ఆమెపువ్వుకు గాజుపెంకులు యిసుకరేణువులూ తళతళలాడినట్టుగా ఆఐదేళ్ళూ గడిచిపోయాయి.

ఇన్నేళ్ళకు ఆమె తల్లికాబోతుందని తెలిసినప్పుడు నిలువెత్తు బంగారం ముందు కుమ్మరించినా పొందని ఆనందం అనుభవించాను. ఆవిషయం ఆమె మొదటిసారిగా నాతో చెప్తున్నప్పుడు సిగ్గుతో మాటలకోసం తడబడుతూంటే చిలిపిగా ఆమె చెయ్యి — బంగారుగాజుల్తో సెలయేరులా గలగలలాడే చెయ్యి పట్టుకొంటే ... ... ..."

అతనలా చెప్తూ భావజగత్తులోకి వెళ్ళిపోయాడు. అతని సమాధి చెడగొట్టడం యిష్టంలేక అలానే మాట్లాడకుండా కూర్చున్నాను. అతను కొంచెంసేపటికి వాస్తవికప్రపంచంలో వచ్చి "ఏమిటి మీరుయింకాయిక్కడేఉన్నారా?" అన్నాడు. నేను మెల్లగానవ్వి ఊరుకున్నాను. అతనుతిరిగి అందుకున్నాడు.

"మీతో ఏదో చెప్తున్నానుగదూ. ఆవిడచచ్చిపోయిందని చెప్పానేమో ... లేదూ ... పోనీ యిప్పుడు చెప్తున్నాగా

ఆమెచచ్చిపోయింది. నాయింట్లో మళ్ళీ దీపంవెలిగించేవారే లేకుండా ఏకాంతంగా నన్నువదిలి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతూ పిల్లవాడినిగూడా ఒళ్ళోవేసుకోనేపోయింది. వెళ్ళిపోయి నన్ను మర్చిపోయిం దనుకున్నారా మీరు. ఆ రోజు కలలోకొచ్చి బావురమని ఏడ్చింది. దెయ్యాన్నయ్యా నని తలబాదుకునే ఏడ్చింది. ఎవరో కిరస్తానీదెయ్యం ఆమెను లాక్కుపోయిందట. అప్పటినుండి ఆమెకిదేనివాసం. సరిగ్గా యీచెట్టుమీదే ఆమె ఉంటూఉండడం. అదిగో అసూర్యస్పశ అరణ్యంలో చెట్ల మధ్య దాక్కున్నప్పుడు ఘల్లుఘల్లుమన్నశబ్దంతో యిటే వస్తుంది. ఆశబ్దంలో కలిసిపోయి సన్నగా తప్పటడుగులూ వినిపిస్తుంటాయి. ఇదిగో మల్లెలవాసన. ఇంకా కొద్దిసేపట్లోనే ఆమెవస్తుంది. ... ఇదేనిదర్శనం. బాబూ మీరు యిక్కడ ఉండకూడదు. వెళ్ళిపోండి. మీరిక్కడఉంటే ఆమె మళ్ళీ నాకు కనుపించదు. ... ..." అలా అంటూ భావనాలోకం లోకి వెళ్ళిపోయాడు. మైకంగా చుట్టూ ఆవరించిన మత్తును దూరంచేసుకొని మెల్లగా అక్కడనుండి బయలుదేరి కంకర రోడ్డును చేరుకున్నాను.

ఆరాత్రి మా ఆవిడ తనను పురిటికి పుట్టింటికి తీసుకు వెళ్ళమని, ఇక్కడేదో భయంగా ఉందని పోరుపెట్టింది. సరే అని అయిదురోజులు స్కూలుకు సెలవుపెట్టి భార్యతో అత్తారింటికి వెళ్ళాను. వెళ్ళిన నాలుగురోజులకే కుర్రాడు పుట్టి పోయాడు. గండంగడిచి పిండం బయటపడడమే బ్రహ్మాండమయిందన్నారు. మరో మూడురోజులపాటు అక్కడే ఉండిపోవలసి వచ్చింది

వాడుకోవడానికి యిక శెలవలులేక నేను తిరిగి వచ్చేశాను. ఆ సాయంత్రం ఏమీ తోచక కాఫీ కాచుకొని తాగి కిటికీ ముందు వట్టినే అలాకూర్చున్నాను.

కొంతకాలంగా మర్చిపోయిన చెప్పుల శబ్దం మళ్ళీ మనసులో మెదుల్తోంది. ఆ శబ్దంగురించి నిరీక్షిస్తున్నాను.

చీకటి మెల్ల మెల్లగా వ్యాపిస్తోంది. సూర్యకిరణాలు చెట్ల చిటారు కొమ్మల్లో మెరిసి మాయ మయ్యాయి. పక్షులు బారులుతీర్చి తిరిగి యిళ్ళకు ఎగిరివస్తున్నాయి. మోపుల ఆడాళ్ళు ఒక్కొక్కరే వెళ్ళిపోతున్నారు. గొల్ల కుర్రవాడు పశువుల్ని యింటికి తోలుకొస్తున్నాడు. మెల్ల మెల్లగ ఊరల్లా చీకటిలో కరిగిపోయింది. క్రమక్రమంగా నిశ్శబ్దమూ, దాన్ని భంగపరుస్తూ కప్పల బెకబెకలు, కీచురాళ్ళ సవ్వడులు వూరంతా వ్యాపించాయి. కాని కిర్రు కిర్రు మనే ఆ జోళ్ళ శబ్దం మాత్రం వినిపించలేదు.

మనసంతా అదోలా ఉంది. అతను కనుపించనందుకు ఎన్నెన్నో రకాల ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి. నాకు తెలీకుండానే నా మనసు కీడును శంకిస్తూ ఆలోచిస్తోంది. దిగాలుగా కూర్చొని చూస్తున్నాను.

దూరంగా మెల్లగా జోళ్ళ శబ్దం వినిపించింది. ఆశతో లేచి వీధి అరుగుమీదకు వచ్చి నుంచున్నాను. నల్లటి ఆకారం చీకట్లో కరిగిపోయి చెప్పుల్ని శబ్దం చేసుకొంటూ యిటే వస్తోంది. ఆ శబ్దం ఆ ఆకారం అలా యింటిముందువరకూ వచ్చి ఆగిపోయింది. ఆవెంటనే చీకటిలోంచి “ మేష్టారూ ” అన్న కేక వినిపించింది.

"ఎవరూ ?" అన్నాను ఆశ్చర్యంగా.

"నేనూ సత్యానందంని. మీరు సాయంకాలం ఊరినుండి వచ్చినట్టు ఎవరో చెప్పారు. కలుసుకొందామని యిలా వచ్చాను. "అంటూ సత్యానందం—నాతోటి సహాధ్యాయుడు లోపలికి వచ్చాడు.

ఆయనకు కుర్చీవేసి కూర్చోబెట్టి ముందుగా మరింకే ప్రస్తావనా ఎత్తకుండా "రోజూ యిటు కట్టవలోబడి ఒకతను వెళ్తుండేవాడు చూశారూ, అతను యీవాళ కనుపించలేదేం?" అన్నాను.

"ఎవరూ! ఆ పిచ్చిమనిషా. రెండురోజులక్రిందటే అకస్మాత్తుగా ఏదో జబ్బుచేసి పోయాడు. ...................."

ఇంకా ఏమిటో చెప్తున్నాడు. నాకదేమీ వినిపించడం లేదు. ఏమిటో! ఎంతో ఆత్మీయుడిలా, బంధువులా ఆ అనామకుని మరణం నా హృదయాన్ని కలచివేస్తోంది.

సత్యానందం కొంచెంసేపు మాట్లాడి వెళ్ళిపోయాడు.

ఊరంతా నిద్రపోతోంది. నిశ్శబ్దం ఊరంతటిని ఆవరించుకొంది. కాని ఆ చెప్పుల శబ్దంమాత్రం ఎక్కడినుంచో మెల్లగ వినిపిస్తూనే ఉంది. వింటూ అలానే చాలాసేపు కూర్చుండి పోయాను.

•